## క్లుప్తంగా

### ఆదిఅంజన్నకు ప్రత్యేక అలంకరణ



**కోయిల్‌కొండ:** మండల కేంద్రంలోని ఆది ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శనివారం కావడంతో స్వామివారికి ప్రత్యేకపూలు, 108 తమలపాకులతో అలంకరించి అష్టోత్తర శతనామావళి వంటి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాఘవేందర్‌రావు తెలిపారు. అదేవిధంగా వింజామూర్ మాజీసర్పంచ్ కుమ్మరి రాములు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### స్వచ్ఛత పాటించని హోటల్‌కు జరిమానా

**జడ్చర్ల:** స్వచ్ఛత పాటించని హోటల్ నిర్వాహకులకు శనివారం స్థానిక మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. నేతాజీ చౌరస్తాలో కొనసాగుతున్న ఓ హోటల్‌లో పరిశుభ్రత పాటించక పోవడంతో మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నగేశ్ రూ.5వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోటళ్లు, బేకరీలు, స్వీటు దుకాణాలతోపాటు తదితర ఆహార పదార్థాలు తయారు చేసిన వారు శుచిశుభ్రత పాటించాలన్నారు. వర్షాకాలంలో పరిశుభ్రత పాటించక పోతే వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, పరిశుభ్రత పాటించని వారిపై చర్యలు చేపడుతామని హెచ్చరించారు. వార్డు అధికారి కృష్ణారెడ్డి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

### పుర సిబ్బందికి రెయిన్‌కోట్లు పంపిణీ

**జడ్చర్ల టౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని కార్మికులకు శనివారం రెయిన్‌కోట్‌లు, గ్లౌజ్‌లను చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. వర్షాకాలం కావడంతో పని చేసే సమయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రెయిన్‌కోట్‌లు పంపిణీ చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో వార్డుకౌన్సిలర్లు కుమ్మరిరాజు, చైతన్యచౌహాన్, కోట్లప్రశాంత్ రెడ్డి, శశికిరణ్, జ్యోతి, రహీం, నరేశ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

### వ్యవసాయ మార్కెట్‌కు స్థల పరిశీలన

**అడ్డాకుల:** మండల కేంద్రం శివారులో నూతన వ్యవసాయ మార్కెట్ నిర్మాణం కోసం శనివారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. అడ్డాకుల, కాటవరం శివారుల్లోని స్థలాన్ని జిల్లా మార్కెటింగ్ అధికారిణి బాలమణి, తహసీల్దార్ శేఖర్, మదనాపురం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, మార్కెట్ కార్యదర్శి సరోజ, డైరెక్టర్లు ఎండీ నిరంజన్, చంద్రశేఖర్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. గుట్ట సమీపంలో ఉన్న స్థలాన్ని పరిశీలించి నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, దశరథ్‌రెడ్డి, దేవేందర్ రెడ్డి, వేణునాథ్ తదితరులు ఉన్నారు.

### సీపీఐ మహాసభల కరపత్రాల విడుదల

**దేవరకద్ర:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగే సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం దేవరకద్రలో కరపత్రాలను విడుదల చేశారు. ఆగస్టు 5, 6వ తేదీల్లో సీపీఐ మహాసభలు జరుగుతాయని దేవరకద్ర నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు భార్గవి తెలిపారు. మహాసభలకు పార్టీ కార్యకర్తలు, కర్షక కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు, బాలు, వెంకటేశ్, శ్రీశైలం, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

### 22షాపుల నుంచి బకాయి వసూలు

**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** ఎట్టకేలకు క్లాక్‌టవర్, మార్కెట్ లైన్‌లోని 22 మున్సిపల్ దుకాణాల నుంచి శనివారం సుమారు రూ.25లక్షల అద్దె వసూలైంది. ఈ రెండు ప్రాంతాల నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.7.50 కోట్ల పైచిలుకు అద్దె బకాయిలు రావాల్సి ఉంది. ఆయా దుకాణాదారులకు పలుమార్లు నోటీసులు అందజేసినా స్పందించక పోవడంతో ఈనెల 24, 25వ తేదీల్లో సీజ్ చేసిన విషయం విధితమే. చివరకు కొంతమేర అద్దె చెల్లించిన దుకాణాదారులను తెరిచేందుకు అధికారులు అనుమతించారు.

### సమస్యలు పరిష్కరించాలి

**చిన్నచింతకుంట:** మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు శనివారం ఎంఈఓ కార్యాలయం ఎదుట భోజనం కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీయూసీఐ అధ్యక్షుడు సాంబశివుడు, కార్యదర్శి దేవదానం, నాయకులు వెంకటన్న, కొండన్న, వెంకటేశ్‌గౌడ్, డానియల్, అరుణమ్మ, బాబు, చంద్రకళ ఉన్నారు.

# డ్రగ్స్ నియంత్రణకు ఉక్కుపాదం మోపాలి

- కలెక్టర్ విజయేందిర బోయి
- అధికారులతో నార్కోటిక్ జిల్లాస్థాయి సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి, చిత్రంలో ఎస్పీ జానకి

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ జానకితో కలిసి మాదకద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై వివిధ శాఖల అధికారులతో నార్కోటిక్ జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రేపటి సమాజ నిర్మాతలైన యువత డ్రగ్ మహమ్మారిబారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, డ్రగ్స్ నిర్మూలనకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా చేసే పాతనేరస్తులపై గట్టి నిఘా ఉంచాలన్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో మాదక ద్రవ్యాలపై ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించి ఎలాంటి డ్రగ్స్ వినియోగించినా పోలీస్‌లకు సమాచారం అందించాలన్నారు. పాఠశాలల వద్ద చాక్‌లెట్ రూపంలో డ్రగ్స్ సరఫరా చేసే ప్రమాదం ఉందని, ఇటువంటివి జరగకుండా పోలీస్‌శాఖ, పాఠశాల యాజమాన్యాలు నిఘా, పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యాసంస్థలలో యాంటీ డ్రగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, డ్రగ్ ఆనవాళ్లు ఉన్నట్లైతే అధికారులకు తెలియజేయాలన్నారు. డ్రగ్ ఇన్స్పెక్టర్స్ తమతమ ఏరియాలలోని వివిధ ఫార్మా కంపెనీలపై నిఘా ఉంచాలని, ప్రతినెలా పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనాబేగం, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘనస్వాగతం



**రాజాపూర్/జడ్చర్ల టౌన్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాంచంద్రారావు మొదటిసారి శనివారం మహబూబ్‌నగర్ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా బాలానగర్, రాజాపూర్, జడ్చర్ల మండల కేంద్రాల్లో పార్టీశ్రేణులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా రాజాపూర్ ముఖ్య కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్గిల్ దివస్ సందర్భంగా రాజాపూర్‌కు చెందిన ఆర్మీ జవాన్‌ను శాలువాలతో సన్మానించారు. జడ్చర్ల క్రాస్‌రోడ్డు వద్ద గజమాలతో స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండలాధ్యక్షులు ఆనంద్, సాహితీరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అధికార ప్రతినిధి బాలవర్ధన్‌గౌడ్, జడ్చర్ల పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. నారాయణపేటకు వెళ్తుండగా కొద్దిసేపు దేవరకద్రలో ఆగారు. పార్టీ నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ఓబీసీ నాయకులు దేవన్నసాగర్, దేవరకద్ర బీజేపీ నాయకులు యజ్ఞభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర



మాట్లాడుతున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర

**జడ్చర్ల టౌన్:** తమతమ ప్రాంతాల్లో నివసించే, విధులు నిర్వహించే చోట ప్రజలతో మమేకమై ఉంటున్నందున చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఇందిర ఆశ కార్యకర్తలకు సూచించారు. శనివారం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ కళాభవన్‌లో ఆశ కార్యకర్తలకు పలు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముఖ్యంగా మహిళలు, బాలికలు ఎదుర్కొనే సమస్యలు, లింగనిరోధకచట్టం, పోక్సోచట్టం, బాల్యవివాహాలు, బాలింతలు, గర్భిణులు, వరకట్నం, గృహహింస చట్టాల గురించి తెలియజేశారు. జడ్చర్ల జడ్జి నిహారిక మాట్లాడుతూ.. అభాగ్యులు, బాధితులకు న్యాయసేవాసంస్థ ద్వారా చట్టపరంగా కల్పించే సహకారాన్ని వివరించారు. ఆశ వర్కర్లు బాధితులను గుర్తించి వారికి చట్టపరంగా అవసరమున్న వారికి న్యాయపరంగా ఏవిధంగా సహాయం అందించవచ్చో తెలిపారు. సమావేశంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మాలిక్‌షాకీర్, అర్చన్, పీహెచ్‌సీ వైద్యాధికారులు మనుప్రియ, ప్రతాప్‌చౌహాన్, న్యాయవాదులు ప్రశాంత్, శంకరాచారి, విశ్వేశ్వర్, ఖాజా ఇఫ్తెకారొద్దీన్, రాములు, పురుషోత్తంరావు, పాండు కుమార్, రమేశ్, అబ్దుల్‌రవూఫ్, విజయలక్ష్మి, పోలీసు సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

**దేవరకద్ర:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీలవారు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి మధుసూదన్‌నాయక్ కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఓటరు జాబితాలను పరిశీలించి తప్పొప్పులను సరిచేయడానికి సూచనలు ఇవ్వాలని కోరారు. శాంతియుతంగా ఎన్నికలు జరగడానికి పార్టీల నాయకులు సహకారం అందించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ కృష్ణయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### భార్య అదృశ్యంపై ఫిర్యాదు

**అడ్డాకుల:** మండల కేంద్రానికి చెందిన పర్వీన్‌బేగం కనిపించడం లేదని భర్త ఖదీర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 24న పర్వీన్ బేగం తన ఇద్దరు పిల్లలను తీసు కుని ఇంట్లో భర్తకు చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయిందని చెప్పారు. భర్త ఖదీర్ బంధువు లు, తెలిసిన వారి ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం ఠాణాలో ఫి ర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### శిశుమందిరాల టీచర్లకు రెండురోజుల శిక్షణ



**జడ్చర్ల టౌన్:** పట్టణంలోని సరస్వతి శిశుమందిరంలో ఉమ్మడి జిల్లాకు చెందిన శిశుమందిరాల ఉపాధ్యాయులకు ఇస్తున్న రెండురోజుల శిక్షణ శనివారం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలోని 30 శిశుమందిరాల నుంచి 150మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. వివిధ రకాల బోధనాపద్ధతులపై శిక్షణ ఇచ్చారు. పాఠ్యాంశాలలో మెలకువలు, సందేహనివృత్తి చేస్తూ మాదిరి పాఠాలు, నూతన జాతీయ విద్యావిధానం ఆవశ్యకతలపై శిక్షణ కొనసాగింది. ఆదివారం శిక్షణ ముగియనుంది. శిక్షణ మొదటిరోజు పాలమూరు విభాగ అధ్యక్షుడు శ్రీనివాసయ్య, సహ కార్యదర్శి బాలరాజు, పాలమూరు జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, విభాగ్ శిక్షణ ప్రముఖ్ కృష్ణమోహన్, పాఠశాల అధ్యక్షురాలు పద్మలీల, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, ప్రధానాచార్యులు వెంకటయ్య పాల్గొన్నారు.

### జీకే ఇంజినీరింగ్ కళాశాలకు అనుమతి

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** మండలంలోని ధర్మాపూర్ సలాంనగర్ వద్ద ఆల్‌మదీనా ఇనిస్టిట్యూషన్ ఆధ్వర్యంలో నూతనంగా ప్రారంభించనున్న జీకే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు అనుమతులు ఇస్తూ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కార్యదర్శి యోగితారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరు ఈ విద్యాసంవత్సరంలో బీటెక్‌లో ఏఐ, ఎంఎల్, సీఎస్‌ఈ, కంప్యూటర్‌సైన్స్, ఐటీ వంటి కోర్సులకు అనుమతులు ఇచ్చారు. ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున భర్తీ చేసేందుకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు.

### 'బీసీలను అవమానించడం తగదు'

**జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):** బీసీలను అవమానిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్ పేర్కొన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన బీ జేపీ జిల్లా కార్యకర్తల సమ్మేళనంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు ముందే ఎంపీ డీకే అరుణ వర్గీయు లు ఆపార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతి కుమార్ గో బ్యాక్ అంటూ అవమానించడాన్ని ఒక ప్రకటనలో ఖండించారు.

### శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దాం



**జడ్చర్ల టౌన్:** బాదేపల్లి బాలుర జెడ్పీ హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలను సమిష్టిగా విజయవంతం చేద్దామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ పిలుపునిచ్చారు. శనివారం హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నవంబర్ చివరివారంలో జరిగే మూడురోజుల ఉత్సవాలను జయప్రదం చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ ఉత్సవాల్లో పూర్తి భాగస్వామ్యం కావాలని కోరారు.స్పందించిన ఉపాధ్యాయులు అత్యవసరంగా టాయిలెట్స్, విద్యార్థులకు డైనింగ్‌హాల్ నిర్మించాలని వివరించారు. ఉత్సవాల నిర్వహణలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. టాయిలెట్స్, డైనింగ్ హాల్ నిర్మాణాల కోసం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేయించుకుందామని నిర్ణయించారు. సమావేశం అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడిని ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. హెచ్ఎం చంద్రకళ, స్టాఫ్ సెక్రటరీ గోపాల్, యుగంధర్‌రెడ్డి, శంకర్, శశిరేఖ, భాగ్య, ఉపాధ్యాయ బృందం, శతాబ్ది ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ ఇబ్రహీం, సత్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆనంద్ పాల్గొన్నారు.

### 1నుంచి హజ్రత్ రవూఫ్‌బాబా ఉర్సే షరీఫ్

**స్టేషన్ మహబూబ్‌నగర్:** జిల్లా కేంద్రం వీరన్నపేటలో హజ్రత్ సయీద్ మహ్మద్ రవూఫ్‌బాబా దర్గా ఉర్సే షరీఫ్‌ను వచ్చేనెల 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ముతవల్లీ మహ్మద్ అబ్దుల్ గఫూర్ నియాజీ తెలిపారు. మజీదే హాఫిజియా ఆవరణలో ఉర్సే షరీఫ్ పోస్టర్లను మతపెద్ద ఆలిండియా సున్నీ ఉల్‌మా మషాయఖ్ బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా మొహిసిన్‌పాషా ఖాద్రీ ఆవిష్కరించారు.

# విరబూసిన బ్రహ్మకమలాలు




హిందూ సంస్కృతిలో పవిత్రమైన బ్రహ్మకమలాలు శ్రావణమాసం వేళ మొదటి శుక్ర, శనివారాల్లో వికసించాయి. జిల్లాకేంద్రంలోని శేషాద్రినగర్‌కు చెందిన లక్ష్మీసుమతి, శ్రీనివాస్ సాగర్ ఇంట్లో మూడు, జడ్చర్లలో అనురాగిణి ఆశ్రమం సమీపంలోని న్యాయవాది తిరుపతి ఇంట్లో ఏకంగా 50 పుష్పాలు, గంగాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం వెనకాల ఉన్న సీనియర్ అసిస్టెంట్ కోట్ల కృష్ణ ఇంట్లో 15 బ్రహ్మ కమలాలు విరగబూశాయి. కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేయగా.. చుట్టుపక్కలవారు దర్శించుకొని తరించారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్ల

# పథకాలను పారదర్శకంగా అందిస్తాం



భూత్పూర్ లో కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

**అడ్డాకుల:** అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలను పైరవీలు, అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా అందజేస్తున్నామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మారిస్తే సీఎం రేవంత్‌రెడ్డి దాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి తావులేకుండా అర్హులకు పథకాలను అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఎవరూ ఒక్క రూపాయి కూడా లంచం అడుగు తలేరని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రజాప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉండాలని కోరారు.

**'సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారు'**

తొమ్మిదేళ్లు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే జీఎంఆర్ విమర్శించారు. అధికారులను కూడా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని చెప్పారు. అధికారుల పేర్లు రాసిపెట్టుకోండి మూడేళ్ల తర్వాత మనం అధికారంలోకి వచ్చినంక వాళ్ల పని చేస్తామంటున్నారని.. మూడేళ్లు కాదు ముప్పై ఏళ్లయినా మీరు అధికారంలోకి రాలేరని చెప్పారు. సొంత చెల్లెలు కూడా నిన్ను అసమించుకుంటుందన్నారు. దోచుకున్న డబ్బుల కోసం అన్నా, చెల్లెలు పంచాయతీ చేసుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, పార్టీ అధ్యక్షుడు శ్రీహరి, నాగిరెడ్డి, జగదీశ్వర్, నాగార్జున్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, దశరత్ రెడ్డి, భీమన్నయాదవ్, లక్ష్మీనారాయణ, సయ్యద్ షఫి, వేగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

**పదేళ్ల రేషన్ కార్డుల కల సాకారం**

**భూత్పూర్:** బీఆర్ఎస్ పదేళ్ల పాలనో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయకుండా కాలయాపన చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి కృషితో రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో భూత్పూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులతో పాటు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 613 రేషన్ కార్డులు, 2,329 మందిని రేషన్ కార్డులో చేర్పించడం జరిగిందని, 40 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, మండలాధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకటన్నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, డీటీ గీత, ఎంపీడీవో ప్రభాకర్, మున్సిపల్ క మిషనర్ నూరుల్‌నజీబ్, మహిళా కాంగ్రెస్ పట్టణాధ్యక్షురాలు పద్మనరేందర్, నాయకులు పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి

**మహమ్మదాబాద్:** నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆయా గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ పేర్కొన్నారు. శని వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రా మాల్లో ఇంకా ఎంతోమంది ప్రమాదకర మట్టిమిద్దెలు, రేకుల ఇళ్లు, పూరి గుడిసెల్లో నివాసాలు ఉంటున్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్నందున సురక్షిత ప్రాంతాలైన ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండటానికి ఆయా గ్రామాల కార్యదర్శులు సహకరించాలని తెలిపారు.

### గణితంతో ఉజ్వల భవిష్యత్

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్:** గణిత సబ్జెక్టు చదువుతున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో మొదటి సంవత్సరం విద్యార్థులు చివరి సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధి, ఉద్యోగ, అవకాశాలు ఇందులో మెండుగా ఉన్నాయని, అందులో పట్టు సాధించిన వారు తప్పకుండా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, సబ్జెక్టు పెపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఓడీ సురేశ్, మధు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

**భూత్పూర్:** ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు త్వరలో విడుదల చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు మదన్మోహన్‌యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని అమిస్తాపూర్, ఎల్కిచర్ల, కొత్త, పాత మొల్గర, కప్పెట, చౌలతండా, గోప్లాపూర్ ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి నెలా రూ.700 కోట్ల నిధులు ఉద్యోగుల బకా యిల కోసం వి డుదల చేస్తామన్న ప్రభుత్వ కేవలం రూ. 170 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, ప్రభుత్వం ఇచ్చినమాట నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. ఉ ద్యోగుల బకాయిల కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో పీఆర్టీయూ (టీఎస్) జిల్లా గౌరవాధ్యక్షుడు బుచ్చారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు బాలరాజ్‌గౌడ్, కార్యదర్శి కృష్ణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేశ్‌రెడ్డి, సాయిరాంగౌడ్, నరేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

### వనపర్తి బస్సును యథావిధిగా నడపాలి



**దేవరకద్ర రూరల్:** పేరూర్ మీదుగా వెళ్లే మహబూబ్‌నగర్–వనపర్తి బస్సును యథావిధిగా నడపాలని టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి శనివారం మహబూబ్‌నగర్ డిపో అసిస్టెంట్ మేనేజర్ రాంజీకి పేరూర్ గ్రామస్తులతో కలిసి వినతిపత్రం అందజేశారు. బస్సు గ్రామం మీదుగా రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమస్యను గుర్తించి పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

### కొకుంట్లలో గరుడోత్సవం

**దేవరకద్ర రూరల్:** శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మొదటి శనివారం కొకుంట్లలో గరుడోత్సవం నిర్వహించారు. అంతకుముందు శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవిసమేతంగా ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనంలో గ్రామంలోని పురవీధుల్లో భజన కీర్తనలు ఆలపిస్తూ ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

### రైతుల పక్షపాతి కాంగ్రెస్

**హన్వాడ:** కాంగ్రెస్ పార్టీ రైతు సంక్షేమమే ధ్యే యంగా పనిచేస్తుందని మండలాధ్యక్షుడు మ హేందర్, డీసీసీ జనరల్ సెక్రటరీ కృష్ణయ్యయాదవ్ పేర్కొన్నారు. శనివారం వారు మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వర్షాలు సమృద్ధిగా కురిశాయని, నేడు రేవంత్‌రెడ్డి హయాంలోనూ అదేస్థాయిలో వర్షాలు కురవడంతో ఏదో ఒకచోట యూరియా కొరత ఏర్పడితే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. సమావేశంలో యాదవరెడ్డి, షబ్బీర్, హుస్సేన్, వెంకటయ్య పాల్గొన్నారు.

### రాజపూర్ ఇన్‌చార్జి హెచ్ఎం సస్పెండ్

**రాజాపూర్:** మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ ఇన్‌చార్జి శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు ఎంఈఓ సుధాకర్ తెలిపారు. శనివారం పాఠశాల విద్యార్థినులు తమపట్ల ఇన్‌చార్జి హెచ్ఎం అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, చాలా రోజులుగా చూస్తున్నా అతనిలో మార్పురావడంలేదని, తమకు న్యాయం చేసి రక్షణ కల్పించాలని ఫిర్యాదు చేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. దీంతోపాటు ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు కూడా ఇన్‌చార్జి హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలిసిన డీఈఓ ప్రవీణ్‌కుమార్ వెంటనే అతన్ని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

# ఉత్సాహంగా జిల్లాస్థాయి యోగా పోటీలు



యోగా పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులతో అసోసియేషన్ ప్రతినిధులు

**మహబూబ్‌నగర్ క్రీడలు:** జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో శనివారం జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం అధికారి కోటనాయక్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో విద్యార్థులు ప్రతిభచాటి జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ.. యోగాను నిత్యజీవితంలో అలవాటుగా మార్చుకోవాలని కోరారు. పోటీల్లో 150మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారిని ఎంపిక చేశారు. అనంతరం ప్రముఖ న్యాయవాది మనోహర్ రెడ్డి విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయి కుమార్, కోశాధికారి సురేశ్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు అశోక్, సీనియర్ యోగా టీచర్లు స్వరూప, వాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

**❖ పోటీల ఫలితాలు**

సబ్ జూనియర్ బాలికల్లో జి.అనూష–ప్రథమ, పావని, రుషిత–ద్వితీయ, బాలురలో బి.శివ (ప్రథమ), జూనియర్ బాలురలో కె.సాయికుమార్–ప్రథ మ, రామన్‌జీ–ద్వితీయ, బాలికల్లో సుప్రజ–ప్రథ మ, పూజిత–ద్వితీయ, ఆరిసిక్‌లో శ్రీహరి–ప్రథమ, గోపాల్–ద్వితీయ, అష్మిత–ప్రథమ, వర్షశ్రీ–ద్వితీయ, రిథమిక్‌లో దీక్ష–ప్రథమ, రుషిక–ద్వితీయ, సీనియర్ మహిళల్లో ఎం.నందిని–ప్రథమ, అమరశ్రీ అభిఘ్న–ద్వితీయ స్థానాల్లో నిలిచారు.